

నరేశ్‌ను పరామర్శిస్తున్న మంత్రి దయాకర్‌రావు

## బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ

పెద్దవంగర, జూన్ 19 : మండలంలోని కొరిపెల్లి గ్రామానికి చెందిన తేలు కుంట్ల నరేశ్ భార్య స్వరూప, కుమార్తె ఆధ్యా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సోమవారం బాధిత కుటుంబ సభ్యులను రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. మంత్రి వెంట సర్పంచ్ శోభ, పాలకుర్తి దేవస్థానం, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ రామచంద్రయ్యశర్మ, మండల కోఆప్షన్ సభ్యుడు ముజిబుద్దీన్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, సంజయ్, పార్టీ గ్రామ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు సుధీర్‌కుమార్, రత్నాకర్‌రెడ్డి, సోమిరెడ్డి, వెంకన్న, భిక్షపతి, ప్రసాద్‌రావు ఉన్నారు.



విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న ఉపాధ్యాయులు

## సర్కారు పాఠశాలల్లో మెరుగైన విద్య

నర్సింహులపేట, జూన్ 19: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని, అన్ని వసతులున్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కార్ బడికే పంపించాలని ఉపాధ్యాయులు కోరారు. సోమవారం మండలంలోని గ్రామాలు, తండాల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించి ఇంటింటా ప్రచారం చేశారు. పూసలితండా, అజ్మీరాతండా, అమిర్యాతండా, అమర్‌సింగ్ తండా, లాలితండా, పిచ్చిరాంతండా, బంగారుతండా, నర్సింహాపురం పాఠశాలల్లో హెచ్‌ఎంలు విద్యార్థులకు యూనిఫాం అందించి మాట్లాడారు. అర్హత, అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో విద్యాబోధన, సకల సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతేడాది నుంచి పాఠశాలల్లో ఆంగ్లబోధన ప్రారంభించాని, ప్రభుత్వ బడుల్లో అందించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కేజీబీవీల్లో దరఖాస్తుల ఆహ్వానం

గిర్మాజీపేట, జూన్ 19: జిల్లాలోని అర్బన్ రెసిడెన్షియల్ కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న 23 పీజీసీఆర్టీ, 2– సీఆర్టీ పోస్టులకు తాత్కాలిక పద్ధతిలో పని చేయడానికి అర్హత, ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో డీ వాసంతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 5లోగా https://schooledu. telangana. gov. in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో సూచించారు. దరఖాస్తుదారులకు రాత పరీక్ష ఆన్‌లైన్‌లో అబ్జెక్టివ్ పద్ధతిలో నిర్వహిచనున్నట్లు డీఈవో తెలిపారు.



దోబీఘాట్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వీరన్న

## రజకుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

డోర్నకల్, జూన్ 19: రజకుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలో 9వ వార్డు బస్టాండ్ పక్కన టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.2 కోట్లతో చేపట్టిన మోడ్రన్ దోబీఘాట్ నిర్మాణానికి అధికారులతో కలిసి భూమి పూజ చేసి అనంతరం మాట్లాడారు. సీఎం కేసీఆర్ రజక సంఘం అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నాని, రజకులకు ఉచిత కరంట్, కులవృత్తికి రూ. లక్ష ఆర్థికసాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కేశబోయిన కోటిలింగం, కౌన్సిలర్ బోరగళ్ల శరత్‌బాబు, పబ్లిక్ హెల్త్ డీఈ నవీన్, ఏఈ హుస్సేన్, రంజక సంఘం నాయకులు లక్ష్మయ్య, మైనార్టీ నాయకులు గౌస్ పాల్గొన్నారు.

# దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ పల్లెలు

- సీఎం కేసీఆర్ పాలనలో పచ్చగా కళకళలాడుతున్న గ్రామాలు
- ఏటా రెండు పంటలకు నీళ్లు..
- డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్
- అబ్బాయిపాలెం, గాలివారిగూడెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

మరిపెడ, జూన్ 19 : సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ పల్లెలు దేశంలోనే అగ్రస్థానంలో నిలిచాయని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని అబ్బాయిపాలెం, గాలివారిగూడెం, బోడతండా, పత్తికుంట తండా, ధరావత్‌తండా, రాంతండా, టీలావత్ తండాల్లో విస్తృతంగా పర్యటించారు. రూ.50లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ పల్లెలు సాగు, తాగు నీటి గోస తీరిపోయి పచ్చదనం, పరిశుభ్రతతో కళకళలాడుతున్నాయన్నారు. నర్సరీలు, పల్లె, పట్టణ ప్రకృతి వనాలు, తడి, పొడి వ్యర్థాల సేకరణ, జీపీలకు ట్రాక్టర్ల అందజేత, వైకుంఠధామాలు, రైతు వేదికల ఏర్పాటుతో వైభవంగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు అండగా ఉంటున్నారు. ఏటా రెండు పంటలు పండించుకునేలా పుష్కలంగా సాగునీళ్లు, 24 గంటల ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుబీమా, నాణ్యమైన విత్తనాలు, సకాలంలో ఎరువులు ఇవ్వడంతోపాటు పండిన పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో బీడు భూములన్నీ సాగులోకి వచ్చి, దిగుబడి మూడింతలు పెరిగిందన్నారు. దళితబంధు పథకం దళితుల జీవితాల్లో వెలుగులు నింపినట్లు వెల్లడించారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న తెలంగాణను దోపిడీ దారుల చేతుల్లో పెట్టొద్దని సూచించారు. రానున్న శాసన సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ వందకుపైగా సీట్లను సునాయాసంగా గెలుచుకొని అధికారాన్ని కైవసం చేసుకుంటుందన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులు కరువై స్థానికేతరులను రంగంలోకి దింపుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, ఎంపీపీ గుగులోత్ అరుణా రాంబాబు, జడ్పీటీసీ తేజావత్ శారదారవీంద్రనాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ సింధూరాకుమారి, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ గుగులోత్ వెంకన్న, నాయకులు ఆయూబ్ పాషా, కవితరెడ్డి, మండల ఉపాధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

# 'గ్రీవెన్స్' వినతులను వెంటనే పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ అభిలాషా అభినవ్



ఫిర్యాదుదారు నుంచి వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ అభిలాషా అభినవ్

మహబూబాబాద్, జూన్ 19 : గ్రీవెన్స్‌లో ప్రజలు అందించిన వినతులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అభిలాషా అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. తనను మోసగించి తన కుమార్తె కొంత భూమిని ఆమెపై రిజిస్ట్రేషన్ చేయించుకొన్నదని, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న కుమార్తెపై చర్యలు తీసుకోవాలని కురవి మండలం మోద్గులగూడేనికి చెందిన కొమ్మరాజుల రాములమ్మ వేడుకున్నట్లు తెలిపారు. కేసముద్రం మండలం ఉప్పరపల్లికి చెందిన తిరుగుడు వీరస్వామి తన పెద్ద కుమారుడు 4వ బెటాలియన్‌లో ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులను పట్టించుకోవడంలేదని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. తన కుమారుడి వద్ద నుంచి ప్రతి నెలా రూ.10 వేలు ఇప్పించాలని కోరారన్నారు. మహబూబాబాద్ పట్టణానికి చెందిన భూక్యా శాంతి 371/2/2లోని తనకున్న 20 గుంటలు రికార్డు పరంగా 1958లో పట్టా ల్యాండ్‌గా తన పేరుపై నమోదైందని, సదరు భూమిపై ఎన్‌వోసీ కోసం దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వ భూమి అని అధికారులు ఎన్‌వోసీని నిరాకరించారని, పూర్తి విచారణ చేపట్టాలని కోరారు. నర్సింహులపేట మండలం రామన్నపేట గ్రామం బోడ్యతండాకు చెందిన సురేశ్ తన కుమారుడికి మరిపెడ ఎస్టీ గురుకులంలో 6వ తరగతి ప్రవేశానికి అవకాశం కల్పించాలని కోరినట్లు వివరించారు. నెల్లికుదురులో 294 సర్వే నంబర్‌లో తమ తాతలనాటి నుంచి వారసత్వంగా వస్తున్న 13.19 ఎకరాల వ్యవసాయ భూమిని ఇద్దరు అన్నదమ్ములం సమానంగా పంచుకున్నామని, ఇదే సర్వే నంబర్‌లో ఈ భూమితో పాటు అదనంగా 8.01 ఎకరాలను కొందరు వారిపై అక్రమంగా మార్చుకున్నారని మహబూబాబాద్‌కు చెందిన వేముల వెంకటేశ్వర్లు తెలిపారు. తమ 1.09 ఎకరాల్లోని భూమిపైకి దౌర్జన్యంగా వచ్చి నా కుటుంబాన్ని చంపుతామని బెదిరిస్తున్నారని, వారి నుంచి భూమిని కాపాడి, ప్రాణరక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం 92 వినతులు అందాయని అదనపు కలెక్టర్ తెలిపారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పెద్దవంగర, జూన్ 19: మండలంలోని అవుతాపురంలో 1993–94 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు పలకరించుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉల్లాసంగా, సంతోషంగా గడిపారు. నాటి గురువులను సన్మానించారు. మృతి చెందిన గురువులు, స్నేహితులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో గురువులు లక్ష్మారెడ్డి, కే సోమయ్య, మధుసూదన్, ఎల్ నర్సింహారెడ్డి, నరేందర్‌రావు, డీ సోమయ్య, యాకయ్య, మల్లారెడ్డి, సంపత్‌రెడ్డి, శ్రీను, ఎల్లయ్య, సత్తయ్య, విష్ణు, పూర్వ విద్యార్థులు వేముల ప్రకాశ్, రాధిక, శోభ, శ్రీమతి, రవికుమార్, బీష్మాచారి, వలీపాషా, శ్రీనివాస్, వేణు, లక్ష్మణ్, అంజయ్య, జంపన్న పాల్గొన్నారు.

## మతోన్మాద చర్యలను కేంద్రం విడనాడాలి

మహబూబాబాద్ రూరల్, జూన్ 19: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద చర్యలను విడనాడాలని ప్రజాపంథా ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి పాయం చిన్నచంద్రన్న అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో డీవీకే వర్ధంతి సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ విధానాలు పెరిగాయని, వాటిని అరికట్టేందుకు అందరూ ఐక్యం కావాలన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి రవి, పూనెం ప్రభాకర్, జగ్గన్న, వీరన్న, పైండ్ల యాకన్న, అనిల్, రాకేశ్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

# చిల్కోడు మోడల్ స్కూల్‌లో విద్యార్థుల ఎంపిక




ఎంపికైన ఎంపీపీఎస్ విద్యార్థులు

డోర్నకల్, జూన్ 19: చిల్కోడు ఎంపీపీఎస్ విద్యార్థులు సోమవారం మోడల్ స్కూల్‌కు ఎంపికయ్యారు. 11 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయగా, అందరూ ఎంపికయ్యారని, ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం తాళ్లరి విద్యాసాగర్, ఉపాధ్యాయులు రజిని అభినందించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణభాను, పీటీ గోవర్ధన్ పాల్గొన్నారు.

## మోతాదులో ఎరువులు వాడాలి

నర్మెట, జూన్ 19: పంటల సాగులో ఎరువులను మోతాదులో వాడాలని, లేకుంటే భూసారం దెబ్బతింటుందని యాదాద్రి భువనగిరి జిల్లా వ్యవసాయ ఏరువాక కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త మధుశేఖర్ అన్నారు. మండలంలోని మల్కాపేటలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై సోమవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మధుశేఖర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగం సంక్షోభం నుంచి బయటపడాలంటే సేంద్రియ వ్యవసాయమే ఏకైక మార్గమని అన్నారు.